# రాష్ట్రంలో విస్తరిస్తున్న వైరల్ జ్వరాలు

## ప్రభుత్వాల ఘోర నిర్లక్ష్యం

**ఆగస్టు** నెలంతా పుష్కరాలతో 'పుణ్య కాలమంతా' గడిచిపోయింది. రాష్ట్రమంత్రులు, అధికార గణాలెవరికీ ప్రజాసమస్యలలో తలదూర్చేందుకు ఏమాత్రం వ్యవధి దొరకలేదు! తీరా చూసేసరికి రాష్ట్రంలో కరవు విజృంభించి, పంటలను కబళించి వేస్తుంటే, తన దృష్టికి తీసుకురాలేదని మంత్రులు, అధికారులమీద చిందులేసి, తానే స్వయంగా పూనుకొని చర్యలు చేబడతానని ముఖ్యమంత్రి ప్రకటించాడు. ఏమాత్రం ఫలితాలనివ్వని రెయిన్‌గన్ల ప్రయోగంతో ప్రపంచంలోనే వినూత్న ప్రయోగం చేసినవానిగా తనకు తాను జబ్బలు చరుచుకున్నాడు.

మరోవైపున రాష్ట్రంలో – ముఖ్యంగా ఏజన్సీ ప్రాంతాల్లో అప్పటికే విషజ్వరాలు విజృంభించి అనేకమంది గిరిజనుల ప్రాణాలను కబళిస్తున్న వార్తలు వెలువడ్డాయి. ప్రతి సంవత్సరం ఈ సీజన్‌లో ప్రాణాంతక జ్వరాలు గిరిజనులపై దాడిచేస్తున్నా తగిన మందులు, వైద్యసౌకర్యాలు, దోమతెరలు తదితర రక్షణ చర్యలతో సన్నద్ధంగా ఉండాల్సిన రాష్ట్రప్రభుత్వం అప్పుడే మేల్కొన్నట్లుగా వ్యవహరిస్తోంది. ప్రాథమిక వైద్యసౌకర్యం అందక మైళ్ళకు మైళ్ళ దూరం మంచాలమీద, డోలీలమీద రోగులను ఆస్పత్రులకు తీసుకెళ్ళినా ఫలితం దక్కక, ప్రాణాలు గాలిలో కలిసిపోతున్న వార్తలెన్నో వెలుగుచూస్తున్నాయి.

మరోవైపున రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేరుకుపోతున్న పరిసరాల కాలుష్యం, పారిశ్రామిక ప్రాంతాల్లో పరిశ్రమల కాలుష్యం, వాతావరణ కాలుష్యం, వెరసి ప్రజానీకం ధ్వని, వాయు, జల, పరిసర కాలుష్యాల నడుమ జీవించాల్సిన పరిస్థితికి నెట్టబడుతున్నారు. రెండు సంవత్సరాలు నిండిన 'స్వచ్ఛభారత్' సంబరాలు కానీ, బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత ప్రాంతాలుగా గుర్తింపులుగానీ, సెప్టిక్ లెట్రిన్ల నిర్మాణానికి యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామని చెప్తున్న చర్యలుగానీ, గ్రామాల్లో, నగరాల్లో ప్రజలను కాలుష్యం బారినుండి రక్షించలేకపోతున్నాయి. అధ్వాన్నమయిన మురుగునీటి పారుదల వ్యవస్థ, పారిశుద్ధ్య సిబ్బందికొరత, ప్రజారోగ్య సేవకుల కొరత, మంచినీటి కాలుష్యంవంటి సమస్యలకు వర్షాలు తోడై జనజీవనం అతలాకుతలమౌతున్నది జలుబు, దగ్గు, డయేరియా, డెంగీ, మలేరియా, టైఫాయిడ్, ఇతర అంతుచిక్కని వైరల్ జ్వరాలు ప్రజల్ని పట్టిపీడిస్తున్నాయి.

ఆరోగ్యకరమైన పరిసరాలను ఏర్పరచి, ప్రజలకు వైరల్ వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యలు తీసుకోవల్సిన ప్రభుత్వం, కనీసం జ్వరాల బారినపడిన ప్రజలకైనా సకాలంలో వ్యాధి నివారణకు చర్యలు చేపట్టకుండా తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. 'దోమలపై దండయాత్ర' పేరిట ప్రచారార్భాటాలతో కాలం గడుపుతోంది.

ప్రజారోగ్యంపట్ల తీవ్ర బాధ్యతా రాహిత్యాన్ని ప్రదర్శిస్తున్న పాలకుల విధానాలలో భాగంగా అరాకొరగానున్న ప్రాథమిక వైద్య కేంద్రాల్ని సైతం పడకన పడేసి, ప్రైవేటు వైద్యరంగానికి గేట్లు బార్లా తెరిచారు. ఫలితంగా చిన్నపాటి జ్వరం, ఇతర జబ్బులకు కూడా ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులవైపు నెట్టబడుతున్నారు. లాభార్జనే ధ్యేయంగా, ఎటువంటి ప్రభుత్వ నియంత్రణాలేని ప్రైవేటు వైద్యరంగం, ముఖ్యంగా కార్పొరేటు వైద్యరంగం, ప్రజల అనారోగ్యాలనే సాధనాలుగా చేసుకొని తమ లాభార్జనకు వనరులుగా మలచుకుంటున్న తీరు ఘోరంగా వుంది.

దేశ ప్రజలకు సార్వత్రిక వైద్య సేవలందజేయటంలో భారతదేశ పాలకులు ఘోర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వస్తున్నారని జాతీయ ఆరోగ్య నివేదిక–2013–14 తాజాగా వెల్లడిచేసింది. ప్రపంచంలో అతి ఎక్కువగా ప్రైవేటీకరించిన వైద్యవిధానం భారతదేశంలోనే వుందని, సాధారణ ప్రజలకు ఇది ఏమాత్రం అందుబాటులో లేకపోగా, కార్పొరేటు ఆసుపత్రులపై ప్రభుత్వాల నియంత్రణ శూన్యంగా వుందని వెల్లడించింది. సబ్ సహారా ఆఫ్రికా దేశాలు ప్రజావైద్యరంగంపై వెచ్చిస్తున్న ఖర్చుతో పోల్చినప్పటికీ, భారతదేశం చాలా తక్కువగా తన స్థూలజాతీయోత్పత్తిలో 1.15 శాతం మాత్రమే వెచ్చిస్తోంది. ప్రజలకు వైద్యాన్నందించాల్సిన బాధ్యత కలిగిన రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆదాయంలో 0.75 శాతం మాత్రమే వైద్యానికి ఖర్చు చేస్తున్నాయి. ప్రభుత్వాలు వైద్యరంగంపై వెచ్చించాల్సిన ఖర్చు ఓవైపున తగ్గిపోతూ వుండగా, మరోవైపున ప్రజానీకం వైద్యంపై పెట్టాల్సిన ఖర్చుల భారం పెరిగిపోతూంది. దాదాపు 64.2 శాతం వైద్య ఖర్చులను ప్రజలు తమ ఆదాయాల నుండే చెల్లిస్తున్నారని ఆ నివేదిక పేర్కొంది.

గడిచిన రెండు మాసాల్లోనే 13 జిల్లాలలో దాదాపు 8 లక్షల మంది జ్వరాలబారిన పడినట్లుగా ప్రభుత్వాసుపత్రులలో నమోదైన గణాంకాలే తెలుపుతున్నాయి. జ్వరాలతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్ళేవారి సంఖ్య ఖచ్చితంగా దీనికి రెట్టింపు సంఖ్యలో వుంటుంది. ఇక అనారోగ్యాలబారిన పడినా వైద్యం అందని మారుమూల ఏజెన్సీ ప్రాంతాలలో ఆదివాసుల సంఖ్య కూడా అధికంగానే వుంది.

రోజురోజుకీ పెరుగుతున్న నిత్యావసరవస్తువుల ధరలు, తరుగుతున్న ఆదాయాలు, నిలకడైన ఉపాధిలేమి, ప్రజల జీవనప్రమాణాలను నానాటికీ దిగజారుస్తున్నాయి. నాణ్యమైన, పుష్టికరమైన ఆహారం మార్కెట్లో అందుబాటులో నున్నప్పటికీ ప్రజల కొనుగోలు శక్తి నానాటికీ క్షీణిస్తూ వుండటం ఫలితంగా కష్టజీవులలో, శ్రామిక కుటుంబాలలో అత్యధికశాతం ప్రజానీకానికి పొట్టపోసుకోవటమే గగనమౌతున్నది. ఇక సమగ్ర, సమతులాహారం అందే పరిస్థితి ఎక్కడుంది?! ఈ నేపథ్యంలో సహజంగానే వీరిలో రోగనిరోధకశక్తి అతి తక్కువగా వుండటం ఫలితంగా సీజనల్‌గా విజృంభించే వైరస్‌ల దాడులకు తేలిగ్గా గురవుతూ వస్తున్నారు. దీనికి తగ్గట్టుగా ముందస్తు జాగ్రత్తచర్యలు చేపట్టని ప్రభుత్వ నిర్లక్ష్యం, ప్రజావైద్యాన్ని ప్రైవేటు, కార్పొరేటుపరం చేసే ప్రభుత్వాల విధానాలు పేదప్రజల ప్రాణాలను గాలిలో దీపంలా మారుస్తున్నాయి.

అన్ని గ్రామాల్లో ప్రాథమిక వైద్యాకేంద్రాల్ని నెలకొల్పి, ఇప్పటికే వున్న వాటిని సంస్కరించి, వాటికి తగిన వైద్యులు, సిబ్బంది, మందులు, కనీస వైద్య పరికరాలను అందించాల్సిన కర్తవ్యాలను ప్రభుత్వం ప్రక్కన బెట్టింది. అంతుచిక్కని జ్వరాలు, ఇతర వ్యాధుల బారినపడిన రోగులకు మెరుగైన వైద్యాన్నందించవలసిన జిల్లా ప్రభుత్వాసుపత్రులను ఒక్కో దానిని కార్పొరేటు ఆస్పత్రులకు కట్టబెట్టే ప్రక్రియను చేపట్టింది. ఇప్పటికే చిత్తూరుజిల్లా ప్రభుత్వాసుపత్రిని 'అపోలో' సంస్థకు అప్పగించింది. ఇక ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య పరీక్షలు నిర్వహించటాన్ని 'మెడాల్' సంస్థకు కట్టబెట్టటం ద్వారా, వందల కోట్ల ప్రజాధనాన్ని కార్పొరేట్ సంస్థలకు దోచిపెడ్తుంది. గత ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పేరిట వేలకోట్ల ప్రజాధనాన్ని కార్పొరేటు వైద్యసంస్థలకు దోచిపెడితే, ప్రస్తుత టిడిపి ప్రభుత్వం 'ఎన్‌టిఆర్ వైద్యసేవ'ల పేరిట అదే విధానాన్ని సజావుగా సాగిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్యకేంద్రాల నిర్వహణ నంతటినీ కార్పొరేటు ఆసుపత్రుల నిర్వహణలోకి తీసుకువస్తూ ప్రభుత్వం నిర్ణయించింది.

ఈవిధంగా ప్రభుత్వ నిర్వహణలోని వైద్యరంగాన్ని నానాటికీ కునారిల్లజేస్తూ, మరోవైపు కార్పొరేటు వైద్యరంగాన్ని పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్న పాలకుల విధానాలతో సామాన్య మధ్యతరగతి ప్రజానీకానికి వైద్యం ఎండమావిగా మిగిలిపోతోంది.

ప్రజారోగ్య ప్రమాణాలలో వివిధ దేశాల క్రమంలో 188 దేశాలలో భారతదేశం 143వ స్థానంలో వుందని ఇటీవలి సర్వే వివరాలు సూచిస్తున్నాయి. ఐక్యరాజ్య సమితి సాధారణ సమావేశాల సందర్భంగా ఈ వివరాలు వెల్లడించారు. ఈ సర్వే అందించిన వివరాల ప్రకారం శ్రీలంక, ఇరాక్, సిరియా, లిబియావంటి దేశాలు మలేరియా వ్యాధిని సంపూర్ణంగా నిర్మూలించి 100 పాయింట్లు సాధించగా, భారతదేశం పది పాయింట్లు మాత్రమే పొందింది. మాతృత్వ మరణాలు భారతదేశంలో అత్యధికంగా చోటుచేసుకుంటున్నాయి. మనదేశంలో ఐదేళ్ళలోపు పిల్లలలో 47 శాతం పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ప్రపంచ దేశాలలోనే ఇది చాలా అధికం.

ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రమాణాల ప్రకారం ప్రతి వెయ్యిమంది జనాభాకు 3.5 ఆసుపత్రి పడకలు వుండాల్సిరాగా, భారతదేశంలో ప్రతివెయ్యిమందికి 0.7 పడకలు (పదివేల మందికి 7 పడకలు) 17 వందల మంది ప్రజలకు ఒక డాక్టరు మాత్రమే అందుబాటులో వున్నారని ఆ నివేదిక వెల్లడిచేస్తోంది.

అదేవిధంగా సరైన వైద్య సదుపాయాలు లభించక ప్రతి ఏటా పదిలక్షలమంది రోగులు భారతదేశంలో మరణిస్తున్నారని, దేశంలోని 70కోట్లమంది ప్రజానీకానికి ప్రత్యేక నైపుణ్య వైద్యుడు అందుబాటులోనే లేరని ఆ నివేదిక తెల్పింది.

ఈ నేపథ్యంలో–ఇప్పటికే ప్రభుత్వరంగంలో వున్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, జిల్లా ప్రభుత్వాసుపత్రులను పటిష్టపరిచి, తగిన సౌకర్యాలు, వైద్యులు, సిబ్బంది, మందులు, పరికరాలతో ప్రజలకు వైద్యసేవ లందించాలని, ఏజన్సీ ప్రాంతాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో అవసరాలకనుగుణంగా ఆదివాసులకు, నిరుపేదలకు ప్రభుత్వం ఉచిత వైద్యం అందించేవిధంగా ఆరోగ్య కేంద్రాల్ని ఏర్పరచాలని, ఏజన్సీ ప్రాంతాల్లో, ప్రభుత్వ ఆసుపత్రులలో ఖాళీగావున్న వైద్య సిబ్బంది, వైద్యుల ఖాళీలన్నీ భర్తీచేయాలని, కార్పొరేటు వైద్యరంగాన్ని నియంత్రించాలని, రీఎంబర్స్‌మెంట్ పేరుతో కార్పొరేటు వైద్యసంస్థలకు కట్టబెట్టే వేలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని ప్రభుత్వాసుపత్రులకే వెచ్చించి, ప్రభుత్వ వైద్యరంగాన్ని మెరుగుపర్చాలని ఉద్యమించాలి. ప్రభుత్వ వైద్యాన్ని హక్కుగా డిమాండ్ చేయాలి. ఇక, ప్రజలలో రోగనిరోధక శక్తిని పెంపొందించేందుకు అవసరమైన పోషకాలను కొనుగోలు చేయగలిగే ఆర్థిక స్థితిగతులను కల్పించాలని, తగిన ఉపాధి, వేతనాలు అందజేసి, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేయాలి. తద్వారా మాత్రమే నిరంతర రోగగ్రస్తులుగా వుండే సహజ స్థితినుండి బయటపడి కనీస మెరుగైన ఆహారాన్ని తీసుకోవటం ప్రజలకు సాధ్యమౌతుంది.

OOOOOO